క్లుప్తంగా

గురుపూర్ణిమ వేడుకలు రేపు

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ వేడుకలను సోమవారం నిర్వహిస్తామని మందిర సేవా సమితి శనివారం తెలిపింది. ఉదయం 5.15 గంటలకు కాగడా హారతి, 6.30కి స్వామివారికి పంచామృత అభిషేకం, 8.30కి ధునిపూజ, 9.30 గంటలకు సామూహిక శ్రీసాయి సత్య వ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, అన్నప్రసాద వినియోగం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు సామూహిక అష్టోత్తర పూజలు, 6.15 గంటలకు సంధ్యా హారతి, విష్ణుసహస్రనామ స్తోత్రము, 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కాళికాదేవి అలంకారంలో కుంకాళమ్మ

ఇందుకూరుపేట: మండలంలోని లేబూరు గ్రామంలో ఉన్న కుంకాళమ్మ ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కాళికాదేవి అలంకారంలో అమ్మవారు పులి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాల నడుమ ఊరేగుతున్న అమ్మవారికి గ్రామస్తులు కర్పూర హారతులు పట్టి స్వాగతం పలికారు. ఉభయకర్తలుగా మన్నెమేల గోపాల్‌రెడ్డి, కామాక్షమ్మ దంపతులు వ్యవహరించారు. తొలుత వర పడుట, ప్రభలు కార్యక్రమం జరిగింది. రాత్రి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది.

శేఖర్‌రెడ్డికి అభినందన



తోటపల్లిగూడూరు : వరిగొండ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కోటా శేఖర్‌రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధ్రువీకరణ అథారిటీ సభ్యులుగా శేఖర్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించగా, ఇటీవల ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి మంత్రి కాకాణిని శేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నేతలు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, చిల్లకూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కామిరెడ్డి సుబ్బారెడ్డి, గోవర్ధన్ ఉన్నారు.

నెల్లూరుకు వెళ్లి పింఛన్ అందజేత



బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్

కోవూరు(విడవలూరు) : విడవలూరు మండలం అలగానిపాడుకు చెందిన గండవరపు పుల్లారెడ్డి అనే వ్యక్తి గుండె ఆపరేషన్ కోసం నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా ఆయనకు వృద్ధాప్య పింఛన్ నగదును వలంటీర్ పానుగోటి లీలాకృష్ణ శనివారం ఆస్పత్రికి వెళ్లి అందజేశారు.

శాకంబరిగా దుర్గమ్మ



నెల్లూరు(బృందావనం): పవిత్ర ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని వైకుంఠపురంలోని కాశీనాయన ఆశ్రమంలో కొలువైన దుర్గమ్మకు శాకంబరి అలంకారాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవీభాగవతం, పారాయణం, భజనలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఆశ్రమ సేవకుడు ధన్వి శ్రీనివాస్, అర్చక పురోహితుడు ముప్పా ప్రసాద్, మహంకాళి వెంకటేష్, కృష్ణవేణి, భువన్, వెంకటేశ్వరనాయుడు, లక్ష్మి, పద్మజ, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

మెట్ల నుంచి పడి బాలిక మృతి

నెల్లూరు(క్రైమ్): మెట్లను శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తూ కిందపడటంతో బాలిక మృతి చెందిన ఘటన మాగుంట లేఅవుట్లోని పావని ట్రిడెంట్ అపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులు తన భార్య, తల్లి, కుమార్తె సరిత (17)తో కలిసి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరాన్ని సరిత చదువుతోంది. గత నెల 30న మొదటి అంతస్తులో మెట్లను శుభ్రపరుస్తూ ప్రమాదవశాత్తూ కింద పడి బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్లారు. విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు బాలికను చికిత్స నిమిత్తం మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్షతో సమస్యలకు పరిష్కారం

- ప్రజలు సద్వినియోగం చేసుకోండి
- డీపీఓ సుస్మితారెడ్డి



ఇందుకూరుపేట: సమస్య పరిష్కారమైన అర్జీదారులతో డీపీఓ సుస్మితారెడ్డి

ఇందుకూరుపేట: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ సుస్మితారెడ్డి కోరారు. మండలంలోని ముదివర్తిపాళెం గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికెట్లను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గ్రామంలో 1,200 కుటుంబాలకు గానూ 744 మంది టోకన్లు పొందారని వివరించారు. వీటిలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి 233, ఆధార్ లింక్ కోసం 166 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రబాబు, డీటీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

➡ పల్లిపాడులో తహసీల్దారు సుబ్బయ్య ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది.

ప్రజలకు మేలు

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లు వారికి కేటాయించిన ప్రతి గృహానికి వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకుంటారని, ఆ మేరకు దాదాపు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ఆటా పిండి పంపిణీ

సివిల్ సప్లయ్స్ ఆధ్వర్యంలో ఈనెల నుంచి ప్రతి కార్డుదారుకు కేజీ ఆటా పిండిని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సివిల్ సప్లయ్స్ డీటీ మురళి తెలిపారు. నాణ్యత కలిగిన పిండిని రూ.15కే అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కార్డుదారులకు ఆటా పిండిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సుధీర్, వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితా, కౌన్సిలర్లు యానాదిరెడ్డి, చీర్ల ప్రసాద్, షకీలాబేగం, నాయకులు పాల్గొన్నారు.

వ్యయ, ప్రయాసలను తగ్గించే విధంగా..

కొడవలూరు: ప్రజల వ్యయ, ప్రయాసలను పూర్తిగా తగ్గించి సంక్షేమ పథకాలను చేరువ చేసే బృహత్తర కార్యక్రమమే జగనన్న సురక్ష అని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పేర్కొన్నారు. మండలంలోని ఆలూరుపాడులో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల సర్టిఫికెట్‌లను శనివారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ఏ సర్టిఫికెట్ పొందాలన్నా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి సమస్యను గుర్తించి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, డీటీ మల్లికార్జున, సర్పంచ్ మోర్ల రమేష్, పార్టీ నేత సుబ్బరామిరెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కోవూరు : అధికారులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీపీఓ సుస్మితరెడ్డి తెలిపారు. మండలంలోని గంగవరం, చెర్లోపాళెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సత్వరమే అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా పేదలకు లబ్ధి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ పార్వతి, ఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, సర్పంచ్ లక్ష్మీకుమారి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

➡ **కోవూరు(విడవలూరు) :** మండలంలోని దంపూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండల సచివాలయ కన్వీనర్ కాటంరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య, ఎంపీపీ భవానమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ పూండ్ల అచ్యుత్‌కుమార్‌రెడ్డి, నాయకులు శ్రీహరిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విశేషాదరణ

ముత్తుకూరు : మండల పరిధిలో శనివారం నుంచి ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేషాదరణ లభించింది. నారికేళపల్లి, మల్లూరు సచివాలయాల పరిధిలో జరిగిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఎంపీడీఓ ప్రత్యూష ఆధ్వర్యంలో నారికేళపల్లి సచివాలయ పరిధిలో 25 మంది వలంటీర్లు 1,421 ఇళ్లను సర్వే చేశారు. 11 రకాల సేవలకు సంబంధించి 1,683 పనులు పూర్తి చేసి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అలాగే, మల్లూరులో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష జరిగింది. ఇక్కడ 13 మంది వలంటీర్లు 666 ఇళ్లను సర్వే చేశారు. ప్రజలు అడిగిన 866 పనులు పూర్తి చేసి, వీటి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీపీ సుగుణ, సర్పంచ్‌లు మాచిరెడ్డి రాజారామిరెడ్డి, కృష్ణవేణి, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, ఈటీపీఆర్డీ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న బుచ్చి చైర్‌పర్సన్



విడవలూరు : దంపూరు గ్రామంలో..

పేదలకు వరం

తోటపల్లిగూడూరు : జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని మండల సచివాలయ కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు అన్నారు. మండలంలోని చిన్నచెరుకూరు, సౌత్‌ఆములూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. తహసీల్దార్ హమీద్ చిన్నచెరుకూరులో, ఎంపీడీఓ హేమలత సౌత్‌ఆములూరులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కోడూరు విష్ణువర్ధన్‌రెడ్డి, చెరుకూరు శ్రీనివాసులునాయుడు, ఆకుల మధు, ఈటీపీఆర్డీ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు ఉయ్యాల భాస్కర్, చెరుకూరు సరళకుమారి పాల్గొన్నారు.



కొడవలూరు: సర్టిఫికెట్‌ను అందజేస్తున్న చలపతిరావు



కోవూరు : ధ్రువీకరణ పత్రాలు అందుకున్న వారితో డీపీఓ సుస్మితారెడ్డి



ముత్తుకూరు : మల్లూరులో ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న అధికారులు



తోటపల్లిగూడూరు : చిన్నచెరుకూరు సచివాలయంలో..

విద్యతోనే పేదల అభివృద్ధి

- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

కొడవలూరు: విద్య ద్వారానే పేదల అభివృద్ధి సాధ్యమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గునపాటి సుధామణి జ్ఞాపకార్థం రూ.40 వేల నగదు బహుమతులు ఇచ్చారు. వీటిని ఇంగ్లిష్ మీడియంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన జయచంద్ర, బి.రుషినాథ్ సింగ్, తెలుగు మీడియంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన సుధీర్, రాఘవేంద్రలకు ఎమ్మెల్సీ చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జేడీ ముప్పా రామలింగం, ఎంఈఓ జి.వసంతకుమారి, ఎంఈఓ–2 ఎస్.అంకయ్య, హెచ్‌ఎం మోహన రామలింగయ్య, పూర్వ విద్యార్థులు సత్యనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సీఆర్పీ ఎం.దయాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'వెంకటేశ్వర'కు అటానమస్ గుర్తింపు



అటానమస్ స్టేటస్ పత్రాలను చూపుతున్న ప్రిన్సిపల్

కొడవలూరు: నార్నురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు వచ్చిందని కళాశాల యాజమాన్యం ప్రకటించింది. ఈ మేరకు కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు మాట్లాడారు. అటానమస్ గుర్తింపు వల్ల 2023–24 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా బ్యాచులర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ, ఎంబీఏ, ఎంసీఏ, వీఎస్ఎల్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ, డిప్లొమాలో రెండు ఎమర్జింగ్ కోర్సులు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. సమావేశంలో కళాశాల యాజమాన్య సభ్యులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం



విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ బాలికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు పారితోషకాల పంపిణీ కార్యక్రమంలో శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 'నాడు–నేడు' పథకం ద్వారా సర్కార్ పాఠశాలల రూపురేఖలను మార్చేశాయని తెలిపారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదిగి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు లేక బోసిపోయేవని, ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిస్థాయిలో మారిందని తెలిపారు. ఈ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. చదువుకునే ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు వేగంగా జరుగుతోందన్నారు. పేదల చదువుల కోసం పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వారి సోదరులు చేస్తున్న కృషి అద్భుతమని ఎమ్మెల్యే కొనియాడారు.

కార్పొరేట్ వద్ద పేదల విద్య తాకట్టు

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ యాజమాన్యం వద్ద తాకట్టుపెట్టి వారి భవితను సర్వనాశనం చేసిన చరిత్ర చంద్రబాబుది అని ఎమ్మెల్యే ప్రసన్న ధ్వజమెత్తారు. గత టీడీపీ ప్రభుత్వంలో బాబు కమీషన్లకు కక్కుర్తిపడి కార్పొరేట్ విద్యాసంస్థలతో చేతులు కలిపారని విమర్శించారు. గతంలో పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడా లేకుండా ఉండేదని తెలిపారు.

ప్రోత్సాహకాల పంపిణీ

ఇటీవల పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థుల్లో ముగ్గురికి రూ.15 వేలు, మరో ముగ్గురికి రూ.10 వేలు చొప్పున రూ.75 వేలను రామనాథమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేశారు. అలాగే 586 మార్కులు సాధించిన మొబీనా సుల్తానాకు నల్లపరెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.25 వేలను అందజేశారు. కార్యక్రమంలో డీజీపీ కసిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి తండ్రి, కవి డాక్టర్ కసిరెడ్డి వెంకటపతిరెడ్డి, డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ పార్వతి, పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంగిటకే ప్రభుత్వ సేవలు

- జగనన్న సురక్ష ప్రారంభోత్సవంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- దరఖాస్తుదారులకు సర్టిఫికెట్ల పంపిణీ



దరఖాస్తుదారుకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని, అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అవసరమైన అన్నిరకాల సర్టిఫికెట్లను అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బద్దెవోలు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జగనన్న సురక్షలో భాగంగా వలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా విచారించి ఏమైనా సాంకేతిక కారణాల వల్ల అందకుంటే వారికి అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు తీసుకుని సచివాలయంలో అందజేస్తారని, జగనన్న సురక్ష శిబిరాల్లో దరాఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులపాటు నిర్వహించే జగనన్న సురక్ష శిబిరాల్లో 2.65 లక్షల మంది వలంటీర్లు, 1.50 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు, 3 వేల మంది మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి వారికి ఏమి కావాలో తెలుసుకుని వెంటనే పరిష్కారం చూపుతారన్నారు. గతంలో అధికారుల చుట్టూ ప్రజలు తిరిగే వారని ఇప్పుడు ప్రభుత్వమే పాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చిన ఘనత మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రానున్న రెండు నెలల్లో పూర్తిస్థాయిలో రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

గ్రామ స్వరాజ్యం దిశగా..
– కలెక్టర్ హరినారాయణన్

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధన దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నారని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. వాటిలో ఒకటి ఇంటి వద్దకే ప్రభుత్వం వచ్చేలా వలంటీర్ వ్యవస్థ తీసుకురావడంతో పాటు పాలనా వికేంద్రీకరణ దిశగా ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి గ్రామస్థాయికి పరిపాలనను తీసుకొచ్చారని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొదటి రోజు 93 సచివాలయాల పరిధిలో సుమారు 50 వేల పైచిలుకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, డీఎల్‌డీఓ వసుమతి, ఎంపీడీఓలు నగేష్‌కుమారి, వెంకటేశ్వర్లు, తహసీల్దార్‌లు వసంత కుమార్, నేతలు సుధీర్, లక్ష్మీనారాయణ, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి, పక్కన కలెక్టర్ హరినారాయణన్

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో సమస్యలను పరిష్కరించేందుకు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 10, 11వ వార్డు కౌన్సిలర్లు, ప్రజలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే బుచ్చిరెడ్డిపాళెన్ని నగర పంచాయతీగా మార్చుకుని ముంబై జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. దీంతో పాటు ప్రతి వార్డులో నుడా నిధులతో పాటు సచివాలయ నిధులతో సీసీరోడ్లు, కాలువలను నిర్మించామన్నారు. ఇతర సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితా, కౌన్సిలర్లు సత్యనారాయణ, యానాదిరెడ్డి, చీర్ల ప్రసాద్ వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, పార్టీ నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మోర్ల మురళి, ప్రవల్లిక, విల్సన్ పాల్గొన్నారు.

నేడు సరస్వతీనగర్‌కు మంత్రి కాకాణి రాక

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం వెంకటాచలం మండలం సరస్వతీనగర్‌లో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య శనివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సరస్వతీనగర్ చేరుకుని ఎంజేపీఏపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలను ప్రారంభిస్తారని తెలియజేశారు.

స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవ

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల పల్లకిసేవను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం పల్లకిసేవ చేపట్టారు. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

మొక్కల పెంపకం చేపట్టాలి



మొక్క నాటుతున్న రిజిస్ట్రార్, విద్యార్థులు

- వీఎస్‌యూ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి

వెంకటాచలం: ప్రతిఒక్కరూ మొక్కల పెంపకం చేపట్టాలని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ సుజయ్‌కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ సాయిప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ పాల్గొన్నారు.